

సమావేశంలో మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవిని సత్కరిస్తున్న దాసు సురేష్, నారగోని తదితరులు

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: బీసీ నేతలు

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కులగణన వివరాలను పున: సమీక్షిస్తామనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ మేధావుల ఫోరం నాయకులు చిరంజీవులు, బీసీ రాజ్యాధికార సమితి నేతలు నారగోని, బీసీ రాజ్యాధికార సమితి చైర్మన్ దాసు సురేష్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కార్యాలయంలో బీసీ కులగణనపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ, పున: సమీక్ష తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కులగణనలో నమోదు చేసుకొనేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను, ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌ను లేదా గ్రామ పంచాయతీ, ఎమ్మార్వో, మీ సేవ, కలెక్టర్ తదితర ప్రాంతాలలో పది రోజుల గడువు విధించాలని కోరారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు స్థిరలక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలి

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రాథమిక దశలోనే సమాజాన్ని చదువుతూ స్థిరలక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని ముందుకు సాగాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బాగ్‌లింగంపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ కార్నివాల్‌ను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక దశలో అన్ని సబ్జెక్ట్‌లలో అవగాహన కలిగి ఉండాలని, ఆట, పాటలలో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ సరోజ వివేక్, డైరెక్టర్ విష్ణుప్రియా, ప్రిన్సిపాల్ విఠలాచారి, వైస్ ప్రిన్సిపాల్ రాధారాణి, ఈఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేపలు పట్టేందుకు అనుమతి ఇవ్వాలి

● రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ డిమాండ్

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీఓ నెం. 343 ప్రకారం చెరువుల్లో చేపలు పట్టేందుకు ఫిషర్‌మెన్ సొసైటీలకు అనుమతి ఇవ్వాలని రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ అమనగంటి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన సొసైటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువుల్లో చేపలు పట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తే రజక కులస్తులకు ఉపాధి కలుగుతుందన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి నిర్ణయం తీసుకోవాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12న ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయిప్రసాద్‌తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లను కలుస్తామన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శులు రామస్వామి, రమేష్, నర్సింహులు, నరేష్, ,సాయిలు తదితరుల

సత్కారం..



బీజేపీ సెంట్రల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన లంకల దీపక్‌రెడ్డికి ఆదివారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నేత డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నల్లకుంట డివిజన్ మాజీ కార్పొరేటర్ వనం రమేష్. - (నల్లకుంట, ఆంధ్రజ్యోతి)



ధృతి కేసరికి వీహెచ్ అభినందనలు

మహిళల క్రికెట్ అండర్ - 19 ప్రపంచ కప్ పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొని విజయం సాధించిన ధృతి కేసరిని ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని తన నివాసంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు సత్కరించి అభినందించారు. ఇండియా జట్టు సభ్యురాలు ధృతి కేసరి భవిష్యత్‌లో క్రికెట్‌లో మరింత రాణించాలని వీహెచ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. - (నల్లకుంట, ఆంధ్రజ్యోతి)



కవి నీలా జంగయ్యకు నేతల నివాళి

తెలంగాణ జన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంటలోని సంఘం కార్యాలయంలో ప్రముఖ కవి, పరిశోధకుడు నీలా జంగయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. నీలా జంగయ్య చిత్రపటానికి వాసవీ సేవా కేంద్రం సలహాదారు కె.రాజశేఖర్‌గుప్తా, ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రావణ్‌కుమార్, జె.శరత్‌కుమార్, కె.రామరాజు, శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. - (నల్లకుంట, ఆంధ్రజ్యోతి)

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హెల్త్‌సిటీ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలోని శ్రీ సాయి డయాగ్నస్టిక్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల పేదప్రజలు ఈ శిబిరానికి వచ్చి వైద్యసేవలను వినియోగించుకున్నారు. క్యాంప్ చైర్మన్ జీకే రమణ పర్యవేక్షణలో మధుమేహ పరీక్షలు చేసి రిపోర్టులు అందించారు. సాయి రితీష్, సతీష్, వంశీ, లక్ష్మణ్ తదితర వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లలితానగర్‌లో సమస్యల లొల్లి

● పేరుకుపోతున్న చెత్తాచెదారం, మట్టికుప్పలు
● దుర్గంధంతో అనారోగ్యం పాలవుతున్న కాలనీవాసులు
● వాహనాల అక్రమ పార్కింగ్‌తో అవస్థలు
● పట్టించుకోని అధికారులు



లలితానగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్‌లో పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారం, మట్టికుప్పలతో పాటు కాలనీలోని రోడ్లకు ఇరువైపులా వాహనాల అక్రమ పార్కింగ్‌ల వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, స్థానిక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపంతో తాము సమస్యలను ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..

కాలనీలోని కూడళ్లలో పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పల కారణంగా దుర్గంధం వెదజల్లుతోందని, కాలనీలో అపరిశుభ్ర పరిస్థితుల కారణంగా చిన్నారులు, వయోవృద్ధులు అనారోగ్య పాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, కాలనీ రోడ్లపై అక్రమ పార్కింగ్‌ల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్తున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ శానిటేషన్ అధికారులు స్పందించి లలితానగర్‌లో చెత్త, మట్టికుప్పలను ఎప్పటికప్పుడు తరలించాలని, ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చెత్తను తరలించాలి



లలితానగర్‌లోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తరలించడంలో జీహెచ్ఎంసీ పారిశుధ్యం విభాగం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారు. కాలనీలోని చెత్త, మట్టికుప్పలను ఎప్పటికప్పుడు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలనీలో అక్రమ పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్రమ పార్కింగ్‌ల నివారణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

- పి.బ్రహ్మం, అడిక్‌మెట్ లలితానగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

పరిష్కరించకుంటే ధర్నా చేపడతాం..



లలితానగర్‌లో పారిశుధ్యం సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలి. ఈ సమస్యపై ఇప్పటికే తాము అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. సమస్యను వెంటనే పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపడతాం.

- పాశం సాయికృష్ణయాదవ్, అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు


దేవాలయాల్లో రాజకీయాలొద్దు

● లక్ష్మీగణపతి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో రాజకీయాలు అవసరం లేదని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని లక్ష్మీగణపతి ఆలయం నూతన పునర్ నిర్మాణ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. నూతన కమిటీ సభ్యులు మారిశెట్టి నర్సింగ్‌రావు, డి. బానుచందర్, సాయికీర్తి, సురేష్‌యాదవ్, నవీన్, శివకుమార్, రాజేష్, భాగ్యలక్ష్మీ, గిరిబాబు, దినేష్, గజానంద్, గణేష్, లలిత, రామకృష్ణ, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, శివకుమార్‌లకు ఆలయ ఈఓ కె. లక్ష్మారెడ్డి నియామక పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సభ్యులు మారిశెట్టి నర్సింగ్‌రావును చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు నూతన కమిటీ సభ్యులను ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అభినందించి మాట్లాడారు. ఆలయం అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, విడి కృష్ణ, అభిషేక్ కెన్నడీ,సంజీవరెడ్డి, గుండు జగదీశ్‌బాబు,జయేందర్‌బాబు, శీలం సత్యనారాయణ,గుర్రం శంకర్, యాదగిరిగౌడ్, గంగం రవి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.



కబడ్డీ క్రీడాకారుడు చిట్టబోయిన శివకుమార్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

శివకుమార్‌యాదవ్ మృతి క్రీడాకారులకు తీరని లోటు

బర్కత్‌పుర,ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ కబడ్డీ క్రీడాకారుడు చిట్టబోయిన శివకుమార్ యాదవ్ మృతి క్రీడాకారులకు, బ్యాంకు ఉద్యోగులకు తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. ఆయన పట్టుదల, క్రీడా స్ఫూర్తిని నేటితరం ఆదర్శంగా తీసుకుని కబడ్డీ క్రీడలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. ఆదివారం కాచిగూడ చప్పల్‌బజార్‌లో శివకుమార్ యాదవ్ సంస్మరణ సభ నిర్వహించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత తదితరులు హాజరై శివకుమార్‌యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శివకుమార్ యాదవ్ కుటుంబం క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో రాణించారని అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌యాదవ్ కుటుంబ సభ్యులు చిట్టబోయిన రాజ్‌కుమార్‌యాదవ్, లడ్డుయాదవ్, వినోద్‌కుమార్‌యాదవ్, పవన్‌యాదవ్, బబ్లూ, గోకుల్‌యాదవ్, సుఖేష్‌యాదవ్, సుజిత్‌యాదవ్, బీజేపీ నాయకులు ఎక్కాల నందు, నందకిషోర్ యాదవ్, ఎక్కాల కన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోని పేదల అభ్యున్నతికి కృషి చేయాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. ఆదివారం పార్సిగుట్టలో శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ కుమార్ శ్రీకాంత్ ముదిరాజ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సంఘం వ్యవస్థాపకురాలు, సంఘ సేవకురాలు సుశీలమ్మ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, భోలక్ పూర్, కవాడిగూడ, గాంధీనగర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ రావు, శ్యామ్‌యాదవ్, రాకేష్‌కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సదానంద్, కంచి కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డి.వెంకటేష్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థి జీవితానికి ప్రీ ప్రైమరీ విద్య పునాది'

కవాడిగూడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇది విద్యార్థుల విద్యా జీవితానికి పునాది లాంటిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎడ్యుకేషన్ వరల్డ్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని హోటల్ మారియెట్ లో ఎర్లీ చైల్డ్ ఉడ్‌కేర్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా ఉన్న 138 నగరాల నుంచి దాదాపు 360 ప్రీ ప్రైమరీ పాఠశాలల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్య బలోపేతానికి విద్యా రంగంలోని ప్రఖ్యాత నిపుణులతో ప్యానల్ చర్చ నిర్వహించారు. రాకెట్ లెర్నింగ్ సహ వ్యవస్థాపకుడు సిద్ధాంత్ సచ్‌దేవా ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ పరివర్తన పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ స్వాతి, పోపట్ వాట్స్, లీనా ఆశర్ ప్రాథమిక విద్య బోధనలో మెలుకువలను సూచించారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ వరల్డ్ సీఈఓ భవీన్‌షా మాట్లాడుతూ, బాల్య విద్య అత్యంత ప్రధానమైనదని విద్యాబోధనలో సులభతరమైన మార్గాల్లో అన్వేషించడానికి ఇలాంటి చర్చా వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు విద్యా బోధనలో వినూత్న పద్ధతులను అనుసరిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న కోల్‌కతా, బెంగళూర్, భువనేశ్వర్ తదితర నగరాలకు ప్రీ స్కూల్స్ అందించే నాణ్యమైన విద్యను గుర్తించి అవార్డులు అందజేశారు. అనంతరం ప్రీ స్కూల్ ర్యాంకింగ్ 2024 -25అవార్డులను ప్రదానం చేశారు.

బాలిక అదృశ్యం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలానా ఆజాద్ నగర్‌లో నివాసముంటున్న అంబిక కుమార్తె జి. సంజన (14) ఇంటి వద్దే ఉంటోంది. బాలిక తల్లి పని ముగించుకొని ఆదివారం రాత్రి ఇంటికి వచ్చేసరికి సంజన కనిపించలేదు. ఆందోళన చెందిన తల్లి పరిసర ప్రాంతాలలో గాలించినా కుమార్తె ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి అంబిక కాచిగూడ పీఎస్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీల ఏబీసీడీ వర్గీకరణతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

● బహుజన కమ్యూనిస్టు పార్టీ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం ఏబీసీడీ వర్గీకరణతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన కులగణనలో ఎంబీసీ కులాల జనాభా లెక్కల వివరాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీసీ(ఎ) జాబితాలోని 68 కులాల జనాభా సర్వే సమగ్రంగా జరగలేదని ఆయన అన్నారు. శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయకుండా జనరల్‌గా బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీ(ఎ)జాబితాలో ఉన్న 68 కులాలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని దండి వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నల్లా సూర్యప్రకాష్, సిద్దిరాములు, వడ్ల సాయికృష్ణ, మారోజు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో బీజేపీ సంబరాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అసమర్థ ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని ఢిల్లీ ప్రజలు గద్దె దింపారని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనీ వినయ్‌కుమార్ అన్నారు. ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం డివిజన్‌లోని ఆంధ్రాకేఫ్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి బాణసంచా కాల్చిస్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు, ఎం. ఉమేష్, మహమూద్, సత్తిరెడ్డి, ప్రకాష్‌గౌడ్, పాల శ్రీనివాస్, మదన్ మోహన్; నర్సింహ, శ్రీనివాస్, సాయికుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, డాక్టర్ చీమ శ్రీనివాస్ తదితరులు

యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : యూజీసీ ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విద్యా విభాగం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన యూజీసీ ముసాయిదాపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, రిటైర్డ్ విద్యాధికారి విజయ్‌కుమార్, విద్యావేత్త మనోజ్, ప్రొఫెసర్ నతానివేలు మాట్లాడుతూ, గవర్నర్లకు ప్రాధాన్యత ఇవ్వడం, భారత రాజ్యాంగం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. విశ్వవిద్యాలయాలలో రాజకీయ జోక్యం తగదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా ఉద్యమం చేపడతామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజాస్వామికవాదులు ఈ యూజీసీ ముసాయిదాను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ గుండు దయానంద్, నాయకులు కొండ స్వామి, అనిల్‌కుమార్, చారి, భూపాల్; జానకిరెడ్డి, శ్యామల, రాంబాబు పాల్గొన్నారు.

బీసీల్లో ముస్లింలను కలపడం తగదు

● తెలంగాణ బీసీ ఐక్యవేదిక

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో బీసీ, ముస్లింలను కలిపి చూపించడం తగదని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో జరిగిన సమగ్ర సర్వే రిపోర్టు ప్రకారం బీసీలు 3 కోట్లపైగా ఉన్నారని తేలిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణనలో బీసీ జనాభా తగ్గించి చూపించిందని, బీసీ జనాభాలో ముస్లింలను కలిపి చూపించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఐక్యవేదిక కో-ఆర్డినేటర్ దశరథం, కార్యదర్శి జె. నిఖిల్, నాయకులు అభిషేక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

ముషీరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని రేడియెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అహ్మద్ భక్తియార్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో సైన్స్ ఫెయిర్- 2025 ను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన 150 నమూనాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తరలి వచ్చారు. అనంతరం ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సయ్యద్ అహ్మద్ భక్తియార్‌తో కలిసి ఎమ్మెల్యే విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈఓ శ్రావణ్ కుమార్, బీఆర్ఎస్ నాయకుడు సోయెల్ అబ్దుల్లా, డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



గుండగోని భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ఢిల్లీ ఫలితాల స్ఫూర్తితో పని చేయాలి

● ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

రాంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ నేతలు పనిచేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన గుండగోని భరత్‌గౌడ్‌ను ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన సన్మానించారు. పార్టీ పటిష్టత కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తలకు అధిష్టానం అవకాశం కల్పిస్తుందని, ఇందుకు భరత్‌గౌడ్ నిదర్శనమని డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, బీజేవైఎం మీడియా సెల్ మాజీ ఇన్‌చార్జి కిరణ్, నాయకులు జైపాల్‌రెడ్డి, రాంరెడ్డి, జి.వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే..

ముషీరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన కంచి కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్‌ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, పార్టీ నాయకులు రాంరెడ్డి, అనిల్ కుమార్, బద్రినారాయణ, రాజు, గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



ఘటనా స్థలంలో శ్రీనివాస్ మృతదేహం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.... చిక్కడపల్లి మెయిన్ రోడ్‌లోని పాపయ్య ఎస్టేట్‌లో ఎం. శ్రీనివాస్(50) అనే వ్యక్తి కార్లు అద్దెకు ఇచ్చే కార్యాలయాన్ని నిర్వ హిస్తున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ ఇటీవల ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తాను షాపు నిర్వహిస్తున్న పాపయ్య ఎస్టేట్ భవనంపైకి ఎక్కిన శ్రీనివాస్ ఒక్కసారిగా అక్కడి నుంచి కిందకు దూకేశాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.